
## నాగావళి నదిలోకి మడ్డువలస నీరు



వంగర: మడ్డువలస గొర్లె శ్రీరాములునాయుడు ప్రాజెక్టు వద్ద శనివారం ఒక గేటు ఎత్తివేసి 2,200 క్యూసెక్కుల నీటిని నాగావళి నదిలోకి విడిచిపెట్టగా, కుడి ప్రధాన కాలువకు 700 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నామని ఏఈ నితిన్ తెలిపారు. ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కురుస్తుండడంతో సువర్ణముఖి, వేగావతి నదుల నుంచి 2,388 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టులో చేరుతోందని, 64.61 మీటర్ల నీటిమట్టం నమోదైనట్టు వెల్లడించారు.



## అన్నదాత గోడు పట్టదా..!

వంగర మండలం సంగాంలో తంపర బట్టి పూర్తిగా పూడుకుపోయింది. పంట పొలాలను నీరు ముంచెత్తుతోంది.

- 8లో

## న్యూస్‌రీల్

### బహిరంగ మలవిసర్జన రహిత గ్రామాలే లక్ష్యం



మాట్లాడుతున్న కలెక్టర్

సాక్షి, పార్వతీపురం మన్యం: ప్రతి గ్రామం బహిరంగ మలవిసర్జన రహితం (ఓడీఎఫ్ ప్లస్) కావాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అన్నారు. స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమంపై శనివారం కలెక్టరేట్ నుంచి జిల్లా, మండలాధికారులతో వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. గ్రామాలు పరిశుభ్రంగా ఉండాలని, ఓడీఎఫ్ ప్లస్‌కు గ్రామస్తులంతా సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. మలేరియా, డెంగీ తదితర వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలన్నారు. రానున్న మూడు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిందని, అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమావేశంలో డీఆర్వో హేమలత, డిప్యూటీ కలెక్టర్ దిలీప్‌చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

### 21న పీడీఎస్ బియ్యం వేలం

విజయనగరం ఫోర్ట్: గత కొద్ది కాలంగా జరిపిన తనిఖీల్లో దొరికిన పీడీఎస్ బియ్యాన్ని ఈ నెల 21వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు విజయనగరం ఎంఎల్ఎల్ పాయింట్ వద్ద వేలం వేస్తామని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి కె.మధుసూదనరావు తెలిపారు. మొత్తం 90.80 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని వేలంవేస్తామని చెప్పారు.

### చంపేసినా ఇక్కడ నుంచి కదిలేదిలేదు



రైతు బజార్ ఎస్టేట్ అధికారులతో మాట్లాడుతున్న ఎం.ఆర్. రైతుబజార్ మహిళా రైతులు

విజయనగరం ఫోర్ట్: మమ్మల్ని చంపేస్తారా.. చంపేయండి.. 26 ఏళ్లుగా ఇక్కడే కూరగాయాలు విక్రయిస్తూ జీవిస్తున్నాం.. ఈ స్థలంలోనే చచ్చిపోతాం.. అంతేగాని ఇక్కడ నుంచి కదిలేది లేదు. చంపేస్తారా రండి ఇక్కడే అందరం రోడ్డుపై పడుకుంటాం. మా మీద నుంచి ఏబండి ఎక్కించేస్తారో ఎక్కించేయండి అంటూ అధికారుల ఎదుట ఎం.ఆర్. రైతు బజార్ రైతులు శనివారం ఆవేదన వ్యక్తంచేశారు. జిల్లాలోని అన్ని రైతు బజార్ల ఎస్టేట్ అధికారులు ఎం.ఆర్.రైతుబజార్ రైతులతో సమావేశమయ్యారు. రైతు బజార్‌ను రింగ్‌రోడ్డు బజార్‌కు తరలించేందుకు రైతులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. రింగ్ రోడ్డు బజార్‌లో షాపులు కేటాయిస్తామని స్పష్టం చేశారు. కొత్తగా రైతు బజార్ ఏర్పాటు చేసి అక్కడకు తరలిస్తామని ఒప్పించే ప్రయత్నం చేశారు. ఈ దశలో రైతులు మాట్లాడుతూ మాకు ప్రత్యేకంగా రైతుబజారు నిర్మించి చూపించండి.. అప్పుడే ఇక్కడ నుంచి కదులుతాం.. రైతు బజార్ కూడా ఎం.ఆర్. రైతు బజార్ పరిసర ప్రాంతాల్లోనే ఏర్పాటు చేయాలి. అప్పటి వరకు మమ్మల్ని చంపినా, నరికినా, కొట్టినా, ఇక్కడ నుంచి కదిలేదిలేదంటూ రైతులు పాలూరి విజయలక్ష్మి, వనం జయలక్ష్మి, సునీత తదితరులు ఎస్టేట్ అధికారుల వద్ద వాపోయారు. రాజు స్థలం అంటున్నారు.. ప్రతినెలా అద్దె ఎందుకు కట్టించుకున్నారని నిలదీశారు.

# పంచాయతీ పనులకు స్కెచ్..
# తీర్మానాలకు చెక్!

- వైఎస్సార్‌సీపీ సర్పంచ్‌ల అనుమతి అనవసరం
- స్థానిక టీడీపీ నాయకుల నిర్ణయమే ఫైనల్
- ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో రహదారులు, గోకులాల పనులు
- మండలాధికారులకు అనధికార ఆదేశాలు



మక్కువలో పంచాయతీ ప్రజాప్రతినిధులు లేకుండా టీడీపీ కార్యకర్తలతో సాగిన గ్రామ సభ

సాక్షి, పార్వతీపురం మన్యం: ఏ పంచాయతీ సర్పంచ్ అయినా తమ ప్రాంత అభివృద్ధినే కోరుకుంటారు. పార్టీలపరంగా రాజకీయాలు ఉంటాయేమో గానీ.. తమ ఊరికి మంచి జరుగుతుందంటే.. ముందుంటారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత త్వరలో జరగబోయే స్థానిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని.. పంచాయతీల్లో పెత్తనమంతా టీడీపీ వారికే అనధికారికంగా కట్టబెడుతున్నారు. వాస్తవానికి ఏ అభివృద్ధి కార్యక్రమం చేపట్టాలన్నా.. పంచాయతీ తీర్మానం ఉండాలి. దాదాపు మెజారిటీ పంచాయతీలు వైఎస్సార్‌సీపీ మద్దతుతో ఉన్నవే. ఇక్కడే అధికార పార్టీ నాయకులకు మండుతోంది. వారి ప్రాబల్యం లేకుండా చేయాలి.. అదే సందర్భంలో టీడీపీ ఛోటా నాయకుల విలువ పెరగాలన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. పంచాయతీ తీర్మానాలు లేకుండానే.. కనీసం సర్పంచ్‌కు తెలియజేయకుండానే పనులకు కొబ్బరికాయలు కొట్టేస్తున్నారు. పనుల కాంట్రాక్టులు కూడా 'తమ్ముళ్ల'కే అప్పగిస్తున్నారు. గతంలో మంజూరైన గోకులం షెడ్లు, ఇతర రహదారుల పనుల విషయంలో ఇదే చోటుచేసుకుంది. ఈ క్రమంలో పెద్ద ఎత్తున నిధులు దుర్వినియోగమయ్యాయి. గోకులాలు నిర్మించకుండానే, చేపట్టినట్లు రాసేసి బిల్లులు చేసుకున్నారన్న ఆరోపణలు వినిపించాయి. ఈ విషయమై సర్పంచ్‌లు గగ్గోలు పెట్టినా ఫలితం లేకపోయింది. పలువురు న్యాయస్థానాన్ని ఆశ్రయించినా కూటమి నాయకులు బెదర లేదు. జిల్లా అధికారులు సైతం వారు చెప్పిందే వేదమన్నట్లు తలాడిస్తున్నారన్న విమర్శలున్నాయి.

### మరోసారి అదే ప్రణాళిక..

మరోసారి ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు మంజూరయ్యాయి. ఈ పనులతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు కూటమి నాయకులు స్కెచ్ వేస్తున్నారు. దీనికి పంచాయతీ తీర్మానాలు కావాల్సి ఉండగా.. మండల అధికారులనే సంతకాలు పెట్టి ఇచ్చేయాలని కూటమి ప్రజాప్రతినిధుల నుంచి అనధికార ఆదేశాలు అందుతున్నాయి.

➡ సాలూరు నియోజకవర్గంలో ఒక్కో మండలానికీ రూ.20 కోట్ల ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రహదారి పనుల కోసం, 100 గోకులాల నిర్మాణానికి మంజూరయ్యాయి. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ఉన్న 110 పంచాయతీల్లో శనివారం గ్రామ సభలు నిర్వహించాలని.. ప్రతి పంచాయతీలోనూ అందరి సంతకాలతో తీర్మానాలు చేసి, మినిట్ బుక్‌లో నమోదు చేయాలని ఆదేశాలందాయి. వైఎస్సార్‌సీపీ స్థానాల్లో సర్పంచ్‌ల మాటతో సంబంధం లేదని.. తీర్మానం చేసినట్లు సంతకాలు పెట్టి ఇవ్వాలని మండల అధికారులకు ఆదేశాలందాయని తెలిసింది.

➡ వైఎస్సార్‌సీపీ మద్దతు సర్పంచ్‌లు ఉన్న పంచాయతీలు వేటికీ గ్రామ సభల సమాచారం అందించలేదు. కేవలం స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్ రహిత పంచాయతీల కోసం తీర్మానం చేద్దామని మాత్రమే పిలుపునిచ్చారు. మక్కువ మండలంలో 21 పంచాయతీలుండగా.. ఇందులో టీడీపీ 2, బీజేపీ ఒకటి కాగా.. మిగిలిన 18 వైఎస్సార్‌సీపీ స్థానాలు. శనివారం గ్రామ సభలు పెట్టినా వైఎస్సార్‌సీపీ 18 పంచాయతీలతోపాటు, బీజేపీ ఒక పంచాయతీ సర్పంచ్‌లు హాజరు కాలేదు. దాదాపు అన్నిచోట్లా ఇదే పరిస్థితి ఉంది.

➡ చట్టబద్ధంగా తమను ఆహ్వానించి, ఏ పనులు అవసరమో చర్చిస్తే, ప్రాధాన్యాన్ని బట్టి తామే తీర్మానం చేసి ఇస్తామని వైఎస్సార్‌సీపీ సర్పంచ్‌లు అంటున్నారు. కొన్నిచోట్ల గతంలో చేసిన తీర్మానాలకు ఆమోదం తెలిపారు. రాజకీయ కక్షతో తమను దూరం పెట్టి, తిరిగి గ్రామాభివృద్ధికి తాము అడ్డుపడుతున్నామని ప్రచారం చేస్తున్నారని వాపోతున్నారు. తమతో సంబంధం లేకుండా వారికి నచ్చినట్లు పనులు చేసుకుని.. టీడీపీ కార్యకర్తలకే గోకులం షెడ్లు మంజూరు చేసుకుంటున్నారని చెబుతున్నారు.



# స్టాక్ వస్తే మాకు చెప్పాల్సిందే..

- నీకు ఇబ్బందైతే మేడమ్ దగ్గరికి రా..
- అంగన్‌వాడీ కార్యకర్తకు 'తమ్ముడి' బెదిరింపు

సాక్షి, పార్వతీపురం మన్యం:

'స్టాక్ వస్తే మాకు చెప్పాల్సిందే. నెలలో ఎన్నిసార్లు వచ్చినా మాకు చెప్పి తీరాలి. స్టాక్ రిపోర్టు చూపించాలి. రావడానికి మాకు అభ్యంతరం లేదు. మేం విసిగిపోం. పిలవడానికి మీకు అభ్యంతరమైతే, సంధ్యారాణి మేడం వద్దకు రా.. తీసుకెళ్తా!'.. ఇదీ అంగన్‌వాడీ కార్యకర్తకు సాలూరు మండలానికి చెందిన ఓ టీడీపీ పంచాయతీ నాయకుడి బెదిరింపు. 'మేడం, నేను సమావేశం పెట్టినప్పుడు మీ సూపర్‌వైజర్ దగ్గర ఏం చెప్పారు? స్టాక్ వచ్చినప్పుడు రిపోర్టు చూపించాలని చెప్పారా, లేదా?' అని గదమాయించాడు. అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రతినెలా గుడ్లు, బియ్యం, పాలు, ఇతర సరకులు వస్తుంటాయి. కేంద్రాల్లో వీటిని సక్రమంగా వినియోగిస్తున్నారా, లబ్ధిదారులకు అందిస్తున్నారా, లేదా అన్నది పర్యవేక్షించడం సూపర్‌వైజర్ల విధి. కచ్చితంగా సెంటర్ విజిట్‌లు వారు చేస్తారు. గతంలో ఎన్నడూ లేని విధంగా సరకులు వచ్చినప్పుడల్లా తమకు చూపించాలని సాలూరు మండలంలో ఓ టీడీపీ నాయకుడు.. అంగన్‌వాడీ కార్యకర్తను ఫోన్లో బెదిరించిన ఘటన చోటుచేసుకుంది. 'తల్లీ పిల్లలకు సరకులు పంచినప్పుడు ఏ రోజైనా మమ్మల్ని పిలిచారా? అన్ని పంచాయతీల్లోనూ పిలుస్తున్నారు.

స్టాక్ వస్తున్నప్పుడు ఎందుకు చెప్పడం లేదు. సంబంధిత రిపోర్టు కూడా మాకు చూపించాలి.' అని ఆ వ్యక్తి.. కార్యకర్తను హెచ్చరించాడు. '15 సంవత్సరాల నుంచి నేను పని చేస్తున్నాను. ఏవైనా ప్రభుత్వ కార్యక్రమాలుంటే.. నాయకులను పిలుస్తాం. సరకులు వచ్చినప్పుడల్లా ఎలా పిలవగలం? రేపు మరో ప్రభుత్వం వస్తే.. వారిని కూడా ఇలానే పిలవమంటారు.' అని ఆమె నచ్చజెప్పేందుకు ప్రయత్నించినా... 'మా ప్రభుత్వ నిబంధన ఇది.. మా మేడం చెప్పారు. పిలవడానికి నీకేమైనా ఇబ్బందా?' అంటూ ఆమెను గదమాయించడం గమనార్హం. దీంతో సదరు కార్యకర్త ఏమీ చెప్పకుండా మౌనంగా ఉండిపోయింది.

## వంట కార్మికుల తొలగింపుపై రాష్ట్రపతికి ఫిర్యాదు



మాట్లాడుతున్న మన్మథరావు, బాధిత మహిళలు

సాక్షి, పార్వతీపురం మన్యం: గిరిజన, రజక చిరు కార్మికులపై వేధింపులు ఆపి, పాఠశాలల్లో తొలగించిన వంట కార్మికులను తక్షణం విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మథరావు డిమాండ్ చేశారు. బలిజిపేట ప్రజాసంఘాల కార్యాలయంలో బాధిత మహిళలు గౌడబ పార్వతి, గౌడబ చినపార్వతి, అరసాడ ఈశ్వరమ్మ, అరసాడప్పడు, పొట్టి కళావతిలతో కలిసి ఆయన శనివారం మాట్లాడారు. బలిజిపేట ఎంపీపీ పాఠశాలలో గిరిజన మహిళా ఆయాను, వంట సహాయకురాలిని.. జెడ్పీహెచ్ఎస్‌లో గిరిజన, రజక వంట మనుషులు, రాత్రి కాపలదారులను నియోజకవర్గ ప్రజాప్రతినిధి ఆదేశాలతో అన్యాయంగా తొలగించారని వాపోయారు. బాధితులు న్యాయస్థానాన్ని ఆశ్రయించగా.. వారిని తక్షణం విధుల్లోకి తీసుకోవాలని ఆదేశాలిచ్చిందని చెప్పారు. ఇక్కడ అధికారులు అమలు చేయలేదన్నారు. రాష్ట్ర గవర్నర్‌కు కూడా సమస్య వివరించామని.. అక్కడ నుంచి జిల్లా అధికారులకు లేఖ పంపినా స్పందన లేదని తెలిపారు. డీఈవో ఉద్దేశపూర్వకంగానే తాత్సారం చేస్తున్నారన్నారు. డీఈవోను అడ్డం పెట్టుకుని నియోజకవర్గ ప్రజాప్రతినిధి కక్ష సాధింపులకు పాల్పడుతున్నారని.. తక్షణం వారిని విధుల్లోకి తీసుకోకుంటే రాష్ట్రపతికి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

## అన్నిశాఖల సమన్వయంతో శాంతిభద్రతల పరిరక్షణ

- అర్ధవార్షిక నేర సమీక్ష సమావేశంలో విశాఖ రేంజ్ డీఐజీ గోపినాథ్ జెట్టి



సమావేశానికి హాజరైన పోలీస్ శాఖ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు



సమావేశంలో మాట్లాడుతున్న విశాఖ రేంజ్ డీఐజీ గోపినాథ్ జెట్టి

పార్వతీపురం రూరల్: జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, ఆహ్లాదకర వాతావరణం నెలకొల్పేందుకు అన్నిశాఖల సమన్వయం అవసరమని విశాఖరేంజ్ డీఐజీ గోపినాథ్‌జెట్టి అన్నారు. పార్వతీపురం పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఎస్పీ ఎస్.వి.మాధవ్ రెడ్డి నేతృత్వంలో శనివారం అర్ధవార్షిక నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో డీఐజీతో పాటు కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్, జిల్లా రెండవ అదనపు న్యాయమూర్తి ఎస్.దామోదరరావు పాల్గొని నేరసమీక్ష చేశారు. ఆరు నెలల్లో జిల్లాలో జరిగిన నేరాలు, నేర నియంత్రణ చర్యలు, పెండింగ్ కేసుల పరిష్కారంపై సమీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గంజాయి రవాణా, అమ్మకాలపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. నిందితులను అరెస్టు చేసేందుకు ప్రత్యేక పోలీస్ బృందాలు ఏర్పాటుచేయాలని సూచించారు. విద్య, వైద్య, స్త్రీ, శిశు సంక్షేమ కార్యక్రమాలపై చర్చించారు. అనంతరం వన్‌స్టాప్ సెంటర్ సేవల వివరాలతో కూడిన గోడపత్రికను డీఐజీ సమక్షంలో ఆవిష్కరించారు.

సమావేశంలో ఏఎస్పీ అంకితా సురాన, డీఎఫ్ఓ ప్రసూన, ఐసీడీఎస్ పీడీ కనకదుర్గ, డీఈఓ రాజ్‌కుమార్, పాలకొండ డీఎస్పీ రాంబాబు, ఏఆర్ డీఎస్పీ థామస్‌రెడ్డి, ఎస్‌బీ సీఐ రంగనాథం, సైబర్ సెల్ సీఐ శ్రీనివాసరావు, సీసీఎస్ సీఐ అప్పారావు, ఏఆర్ఐలు రాంబాబు, నాయుడు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో పాటు వివిధ శాఖల అధికారులు, జిల్లాలోని సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

## వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శులుగా జిల్లా నాయకులు



ఎమ్మెల్సీ పి.వి.సూర్య నారాయణరాజు



కె.వి.వి.సూర్య నారాయణరాజు



నెక్కల నాయుడుబాబు

విజయనగరం: వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శులుగా విజయనగరం జిల్లాకు చెందిన ముగ్గురు నాయకులు నియామకమయ్యారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ నియామకాలు జరిగినట్టు పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. రాష్ట్ర కార్యదర్శులుగా ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సూర్యనారాయణరాజు (సురేష్ బాబు), కేవీవీ సూర్యనారాయణ రాజు, నెక్కల నాయుడుబాబు నియామకమయ్యారు. వీరు పార్టీ కేంద్ర కార్యాలయంతో సమన్వయం చేసుకుంటూ, సంబంధిత రీజినల్ కో–ఆర్డినేటర్లు, పార్లమెంటరీ నియోజకవర్గ పరిశీలకులకు సహాయకారిగా వ్యవహరిస్తారన్నారు.

### ● వెద.. రైతుకు కన్నీటి వ్యథ!

వరుణుడు కరుణించడం లేదు. పది రోజులుగా భానుడు భగ్గుమంటున్నాడు. వరి నారు, వెద పొలాలు ఎండిపోతున్నాయి. కళ్లముందే మొక్కదశలో ఉన్న వరి పంట ఎండిపోతుండడంతో రైతులు కన్నీరుపెడుతున్నారు. చినుకు కోసం ఆకాశం వైపు ఆశగా ఎదురుచూస్తున్నారు. సాయంత్రం వేళ కమ్ముతున్న మేఘాలు నీటిమూట విప్పకుండా కనుమరుగవుతుండడంతో ఉసూరుమంటున్నారు.

- సీతానగరం



రేపటివలసలో ఎండిపోతున్న వరి వెద మడి



సూరంపేటలో ఎండుతున్న వరి వెద

'ఎంఏ, బీఈడీ పూర్తిచేసి విజయనగరం పట్టణంలోని ఓ కార్పొరేట్ విద్యాసంస్థలో 10 సంవత్సరాలుగా పనిచేస్తున్నాను. ప్రారంభ దశలో నెలకు రూ.5,500కు విధుల్లో చేరాను. ఇప్పుడు రూ.15వేలు ఇస్తున్నారు. ప్రతిరోజూ దాదాపు పది గంటలకు పైగా పనిచేయాల్సి వస్తోంది. ఫలితాలు సాధించడంలో విద్యార్థుల కంటే ఉపాధ్యాయులపైనే ఒత్తిడి అధికం. సెలవులు ఉండవు. అత్యవసర వేళ సెలవు ఇవ్వకుండా ఉండిపోతే అదే ఉద్యోగానికి చివరిరోజు అవుతుంది.'

– ఇదీ ఓ ప్రైవేట్ స్కూల్ ఉపాధ్యాయుడి ఆవేదన

'డిగ్రీ పూర్తి చేశా.. ప్రైవేటు పాఠశాలలో నెలకు రూ.8 వేలు ఇస్తున్నారు. అదీ ప్రతి నెలా ఇవ్వరు. రెండు మూడు మాసాలకు ఒక పర్యాయం చెల్లిస్తున్నారు. పైగా రికార్డుల్లో చూపించి నంత జీతం ఇవ్వడంలేదు. రెవెన్యూ స్టాంపులు వేయించుకొని మరీ సంతకాలు తీసుకుంటున్నారు. ప్రభుత్వం ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు ఇవ్వకపోవడంతో విధిలేక విధులు నిర్వర్తిస్తున్నా..'

– మరో టీచర్ వ్యథ




విజయనగరం అర్బన్: ప్రైవేటు విద్యాలయాల్లో ఉపాధ్యాయ వృత్తి అడకత్తెరలో పోకచెక్కలా తయారైంది. అధిక పనిభారం వారిని తీవ్రంగా కుంగదీస్తోంది. ఏటా ఫీజులు పెంచుతూ తల్లిదండ్రుల నుంచి ముక్కుపిండి వసూలు చేసే యాజమాన్యాలు ఉపాధ్యాయుల వేతనాల విషయంలో మాత్రం శీతకన్ను వేస్తూ శ్రమదోపిడీకి పాల్పడుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వేసవిలో యాజమాన్యాల ఒత్తిడి, ప్రవేశాల లక్ష్యం వారిని మరింత కలవరపెడుతోందని ప్రైవేటు ఉపాధ్యాయ సంఘం సభ్యులు వాపోతున్నారు. ఇచ్చిన జీతాలతో కుటుంబ జీవనం నెట్టుకోలేక... తప్పనిసరిగా ట్యూషన్స్ చెప్పుకోవాల్సి వస్తుందని చెబుతున్నారు. ఉమ్మడి విజయనగరం జిల్లాలో 6 కార్పొరేట్ విద్యాసంస్థలతో పాటు 553 వరకు ప్రైవేటు పాఠశాలలున్నాయి. వాటిలో 7 వేల మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. వీరిలో చాలా మంది ఒత్తిడితో కూడిన ఉద్యోగాలు చేస్తున్నారు. పట్టణంలో ఓ ప్రైవేటు పాఠశాలకు చెందిన ఉపాధ్యాయురాలు తన భర్త అనారోగ్యం కారణంగా సడన్‌గా సెలవు పెట్టింది. ప్రిన్సిపాల్ సెలవు మంజూరు చేయకపోవడమేకాకుండా ఆ స్థానంలో మరొకరిని నియమించారు.

### సెలవు పెడితే వేతనంలో కోత..

జిల్లాలోని మండల కేంద్రాల్లోని పాఠశాలల్లో పనిచేస్తున్నవారికి నెలకు రూ. 5 వేలకు మించి వేతన ఉండదు. పట్టణ పరిధిలోని ప్రైవేటు స్కూళ్లలో అయితే రూ.8 వేల నుంచి రూ.10 వేలు మాత్రమే చెల్లిస్తున్నారు. ప్రతినెలా వేతనాలు చెల్లించే పాఠశాలలు తక్కువగానే ఉన్నట్లు వాపోతున్నారు. అత్యవసర సెలవు పెట్టినా జీతంలో కోత విధిస్తున్నారు. పీఎఫ్, ఈఎస్ఐ వంటివి పూర్తిస్థాయిలో అమలు కావడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. తనిఖీలు జరిపి బోధకులకు న్యాయం చేయాల్సిన విద్యాశాఖ నిస్తేజంగా మారిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కార్మిక శాఖ అధికారులు సైతం చర్యలకు ఉపక్రమించడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

## ఓపెన్‌స్కూల్ విద్యార్థులకు ధ్రువపత్రాలు

విజయనగరం అర్బన్: ఓపెన్ స్కూల్–2025 విద్యా సంవత్సరంలో ఉత్తీర్ణులైన పదోతరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థుల ధ్రువపత్రాలను సార్వత్రిక విద్యా పీఠం విడుదల చేసిందని డీఈఓ యు.మాణిక్యంనాయుడు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. వీటిని అభ్యర్థుల ఇంటి అడ్రస్‌కు స్పీడ్ పోస్టులో పంపిస్తామని తెలిపారు. అడ్రస్‌ల వివరాలను 'ఏపీ ఓపెన్‌స్కూల్.ఏపీ.జీఓవీ.ఐఎన్' వెబ్ సైట్‌లో పరిశీలించుకోవాలన్నారు.

### 24న టీటీసీ లోయర్ గ్రేడ్ థియరీ పరీక్షలు

టీటీసీ లోయర్ గ్రేడ్ థియరీ పరీక్షను ఈ నెల 24న రెగ్యులర్, ఫెయిలైన విద్యార్థులకు నిర్వహిస్తామని డీఈఓ తెలిపారు. ఆ రోజు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ఎడ్యుకేషన్ సైకాలజీ అండ్ స్కూల్ అడ్మిషన్ పేపర్, మధ్యాహ్నం 2 నుంచి 3 గంటలకు మెథడ్స్ ఆఫ్ టీచింగ్ (జనరల్) పేపర్, 3.30 నుంచి 4.30 గంటలకు మెథడ్స్ ఆఫ్ టీచింగ్ (స్పెషల్) పేపర్ పరీక్ష ఉంటుందని తెలిపారు. అభ్యర్థులు హాల్‌టికెట్, గుర్తింపు కార్డుతో పరీక్షకు హాజరుకావాలని కోరారు.

## ● పోలీసుల 'మొక్క'వోని దీక్ష



పర్యావరణ పరిరక్షణలో పోలీసులు భాగస్వాములయ్యారు. చింతవలస ఐదవ ఏపీఎస్‌పీ బెటాలియన్‌లో శనివారం వనమహోత్సవం నిర్వహించారు. బెటాలియన్ ఆవరణలో 'జగమంతా వనం–ఆరోగ్యంతో మనం' పేరిట బెటాలియన్ కమాండెంట్ మలికా గార్గ్ ఆధ్వర్యంలో పోలీస్ అధికారులు, సిబ్బంది సామూహికంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా బెటాలియన్ అదనపు కమాండెంట్ సి.రాజారెడ్డి మాట్లాడుతూ భవిష్యత్ తరాలకు మంచి పర్యావరణాన్ని అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. నాటిన మొక్కలను సంరక్షిస్తే పర్యావరణాన్ని రక్షించినట్టు అవుతుందన్నారు.

– డెంకాడ

## క్లుప్తంగా

### సారా స్థావరాలపై పోలీసుల దాడులు



బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న పోలీసులు

వంగర: మండల పరిధి వి.వి.ఆర్.పేట గ్రామ సమీపంలో సారా స్థావరాలపై శనివారం పోలీసులు దాడులు చేశారు. ఎస్‌ఐ షేక్ శంకర్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది నాగావళి పరివాహక ప్రాంతంలో గాలించారు. ఓ ప్రదేశంలో 1500 పులిసిన బెల్లం ఊటను గుర్తించి ధ్వంసం చేశారు. అనంతరం గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పించారు. సారా తయారీ చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

### రెండు బైక్‌లు ఢీకొని నలుగురికి గాయాలు



గాయాల పాలైన యువకులు

మక్కువ: మక్కువ – చినబోగిలి రహదారి మధ్య ములక్కాయవలస గ్రామ సమీపంలో శనివారం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో నలుగురు యువకులు గాయాల పాలయ్యారు. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం వెంకటభైరిపురం గ్రామానికి చెందిన గంటసాగర్ అనే యువకుడు ద్విచక్ర వాహనంపై మక్కువ వస్తుండగా, మక్కువ నుంచి ములక్కాయవలస గ్రామం మీదుగా మక్కువకు చెందిన చోడవరపు జశ్వంత్, కాతా తనూజ్, చెముడు గ్రామానికి చెందిన వి.విష్ణు బైక్‌పై వస్తున్నారు. ఎదురెదురుగా వచ్చిన రెండు వాహనాలు ఢీకొనడంతో నలుగురూ గాయాల పాలయ్యారు. వెంటనే స్థానికులు వీరిని మక్కువ పీహెచ్‌సీకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం, మెరుగైన చికిత్స కోసం పార్వతీపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

భోగాపురం: భోగాపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో గల జాతీయ రహదారి 16పై శనివారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఎరుపు రంగు షర్ట్ వేసుకున్న ఈ వ్యక్తి సమాచారం తెలిస్తే 9121109445 నంబరును సంప్రదించాలని ఎస్‌ఐ ఎస్‌ఐ సూర్యకుమారి తెలిపారు.

### లోయలో పడిపోయిన ట్రాక్టర్ ఇంజిన్



లోయలో పడిపోయిన ట్రాక్టర్ ఇంజిన్

సాలూరు: మండలంలోని గిరిశిఖర సంపంగిపాడు పంచాయతీ సుల్లారి నుంచి దిగువరూఢి మధ్య మలుపు వద్ద ట్రాక్టర్ అదుపు తప్పి లోయలో పడిపోయింది. పట్టణం నుంచి యూరియా కొనుగోలు చేసుకుని జీపులో కురుకుటి వరకు తీసుకువచ్చారు. అక్కడ నుంచి ట్రాక్టర్‌లో లోడ్ చేసుకుని వెళ్తుండగా, దిగువ రూఢి మలుపు వద్ద ఆపాడు. ఇటీవల వర్షాలు పడుతుండడం మలుపు ప్రమాదకరమని ముందుగానే గుర్తించి, వారు లోడును అక్కడ నిలిపేశాడు. ట్రాక్టర్ ఇంజిన్‌ను ముందుకు వెనక్కి తీసి లోడుతో ట్రాక్టర్ వెళ్లేందుకు అనువుగా చేసే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో ట్రాక్టర్ ఇంజిన్ అదుపు తప్పడాన్ని గమనించిన డ్రైవర్ వెంటనే అప్రమత్తమై గెంతేయడంతో ప్రమాదం తప్పి డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డాడు. కాగా వాహనం సుమారు 200అడుగుల లోతులో పడిపోయింది.

### ఏడుగురికి రూ.70వేల జరిమానా

పార్వతీపురం రూరల్: మద్యం సేవించి వాహనాలను నడిపినందుకుగాను ఏడుగురు వ్యక్తులకు ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో రూ. 70వేలు జరిమానాను పార్వతీపురం ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ విధించినట్టు పట్టణ సీఐ కె.మురళీధర్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండోసారి మద్యం సేవించి వాహనాలు నడిపి పట్టుబడితే మూడు నెలల జైలు శిక్ష తప్పదని హెచ్చరించారు.

### చికెన్

బ్రాయిలర్

| లైవ్ | డ్రెస్డ్ | స్కిన్‌లెస్ |
|---|---|---|
| ₹96 | ₹162 | ₹172 |

# అన్నదాత గోడు పట్టదా..!

- సంగాంలో అన్నదాతకు తీవ్రనష్టం
- పూడుకుపోయిన తంపర బట్టి
- పంట పొలాల్లోకి వరద నీరు
- నీట మునిగిన పంట పొలాలు
- ఏటా ఇదే దుస్థితి
- పట్టించుకోని ప్రభుత్వం, అధికారులు
- 300 ఎకరాల్లో వరద నీరు పోటు



సమస్య పరిష్కరించాలంటున్న రైతులు



పూడుకుపోయిన తంపరబట్టిని చూపుతున్న రైతులు



నీటిలో మునిగిన వరి పంట

వంగర: మండల పరిధి సంగాంలో అన్నదాతకు తీరని నష్టం జరుగుతుంది. వర్షం నీరు.. వరద నీరు మళ్లించేందుకు ఏర్పాటు చేసిన తంపర బట్టి పూర్తిగా పూడుకుపోవడంతో ఆ నీరు పంట పొలాల్లోకి వెళ్లిపోతుంది. దీంతో పంట పొలాల్లో నీరు నిలువ ఉండడంతో 300 ఎకరాలు మేర పంటకు ఏటా నష్టం జరుగుతుందని రైతులు గగ్గోలు పెడుతున్నారు. తంపర భూములు చుట్టూ ఇక్కడ ఉన్న చేపల చెరువు యజమాని గట్టు కట్టేయడంతో ఈ సమస్య మరింత జఠిలమైంది. దీంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఈ సమస్యను పరిష్కరించాలంటూ సంగాం, మగ్గూరు గ్రామాలకు చెందిన రైతులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయింది.

**ఇదీ సమస్య..**

సంగాం, మగ్గూరు గ్రామాలకు చెందిన కడుమల పొలం, షావుకారి పొలం, బోరుమడులు, బడంతాలు పొలంతో పాటు మరిన్ని పంట పొలాలు ఏటా నీట మునుగుతున్నాయి. సంగాంకు చెందిన 250 ఎకరాలు, మగ్గూరుకు చెందిన 50 ఎకరాలు తంపర బట్టి సమీపంలో పంట పొలాలున్నాయి. ఈ తంపర బట్టి ఎగువ భాగంలో 16 ఎకరాల తంపర పొలాలున్నాయి. ఈ పొలాల్లో చేరిన వరద నీరు తంపర పొలాల నుంచి తంపర బట్టిలోకి వెళ్లి నేరుగా సంగాం గ్రామ సమీపంలో ఉన్న నాగావళి నదిలోకి ప్రవేశిస్తుంది. అయితే తంపర బట్టి పూర్తిగా పూడుకుపోవడంతో చేపలు చెరువుల్లోని నీరు, తంపర పొలాల్లోని నీరు పంట పొలాల్లోకి చొరబడుతుంది. దీంతో ఈ సమస్య నెలకొంది.

**ప్రభుత్వం.. అధికారుల నిర్లక్ష్యం**

గడిచిన కొన్నేళ్లుగా తంపర బట్టి పొలాలపై ప్రభుత్వం, అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని రైతులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. తంపర బట్టిలో పూడిక తీత పనులు చేపడితే కొంత నష్ట నివారణ జరుగుతుందని, అదే విధంగా ఇరిగేషన్ అధికారులు కూడా ఇక్కడ పనులు చేపట్టడకపోవడం ఈ పరిస్థితి నెలకొంది. అలాగే 14 మీటర్లు వెడల్పు ఉన్న తంపర బట్టి కేవలం నాలుగు మీటర్లకు కుదించిపోవడంతో వృథా నీరు, వరద నీరు వెలుపలికి తరలించే పరిస్థితి లేదు. చేపలు చెరువు యజమాని ఏటా రెండుసార్లు తంపరబట్టిలో పూడిక తీస్తామని హామీ ఇచ్చినా ఎన్నడూ పట్టించుకోలేదని ఆయకట్టు రైతులు ఆవేదన చెందుతున్నారు. తంపరబట్టికి ఇరువైపుల ఉన్న సంగాం, మగ్గూరుకు చెందిన 300 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లుతుంది. ప్రస్తుతం రైతులు ఉబాలు వేసిన నాట్లు నీటిలోనే ఉన్నాయి.

### ఏటా పంటకు తీవ్ర నష్టం



తంపర బట్టి పూర్తిగా పూడుకుపోయింది. 14 మీటర్లు వెడల్పు ఉన్న కాలువ నాలుగు మీటర్లకు కుదించుకుపోయింది. ఎగువ ప్రాంతంలో ఉన్న తంపర భూముల నీరు, చేపలు చెరువుల్లో ఉన్న నీరు ఒక్కసారిగా పంట పొలాల్లోకి వచ్చి నిల్వ ఉండడంతో పంట నాశనం అవుతోంది.

– బోను ఆనందరావు, రైతు, సంగాం

### కలెక్టర్ ఫిర్యాదు చేసినా...



తంపర బట్టి సమస్యను కలెక్టర్ ఫిర్యాదు చేసినా అధికారుల్లో స్పందన లేదు. బట్టి పూర్తిగా పూడుకుపోవడంతో తమ పొలాల మీదుగా నీరు ప్రవహిస్తుంది. లోతట్టు పొలాల్లో నీరు నిలువ ఉండడంతో పంటలు నాశనమవుతున్నాయి. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌లో పంటలు నీట మునిగిపోతున్నాయి. అన్నదాతలు ఎలా బతకాలి.

– కాంబోతుల సింహాచలం, రైతు, సంగాం

### తక్షణమే పనులు చేయాలి



తంపర బట్టిలో తక్షణమే పనులు చేపట్టాలి. నీటి పారుదల శాఖ, ఉపాధి హామీ పథకం ద్వారా తక్షణమే పనులు చేపట్టి పూర్తి స్థాయిలో మట్టిని తొలగించి బట్టిని వెడల్పు చేపట్టాలి. లేకపోతే భవిష్యత్‌లో ఒక్క ఎకరా కూడా సాగు చేయలేని పరిస్థితి ఉంది. అధికారులు స్పందించాలి.

– కాంబోతుల రాంబాబు, రైతు, సంగాం.

# వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతను పాటించాలి



పెదబొండపల్లిలో చెత్త సేకరణ కేంద్రంలో వర్మీ కంపోస్టును పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి నారాయణ భరత్‌గుప్తా, కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

- జిల్లా ప్రత్యేకాధికారి నారాయణభరత్ గుప్తా

పార్వతీపురం రూరల్: ప్లాస్టిక్ రహిత సమాజంలో ప్రతీ ఒక్కరు భాగస్వామ్యులు కావాలని, అలాగే ప్రతీ ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించాలని జిల్లా ప్రత్యేకాధికారి డా.నారాయణ భరత్ గుప్తా జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు. శనివారం పార్వతీపురం మండలంలోని పెదబొండపల్లి గ్రామంలో స్వచ్ఛ దివాస్ కార్యక్రమంలో కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్‌తో కలసి పాల్గొన్నారు. ఈ మేరకు గ్రామంలో ఉన్న చెత్త సేకరణ కేంద్రాన్ని వారు పరిశీలించి వర్మీకంపోస్టు తయారీ విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలో రెండు రకాల డస్ట్‌బిన్లను స్థానికులకు పంపిణీ చేశారు. వాటిలో తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా వేయాలని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇతర రాష్ట్రాల్లో నిత్యావసరాలకు గుడ్డ సంచులను వినియోగిస్తున్నారని, అదే విధంగా మన జిల్లాలో కూడా ప్లాస్టిక్ వినియోగానికి స్వస్తి పలికి పర్యావరణానికి హానికరం లేని వస్తువులను ప్రజలు వినియోగించాలని సూచించారు. ఐటీడీఏ పీవో అశుతోష్ శ్రీవాత్సవ, డీపీవో కొండలరావు, డీఆర్‌డీఏ పీడీ సుధారాణి, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# అగ్ని ప్రమాదంలో ఆస్తి నష్టం రూ.80లక్షలు



గోదాం యజమాని వెంకటరమణతో మాట్లాడుతున్న తహసీల్దార్ కామేశ్వరరావు, ఫైర్ ఆఫీసర్ సర్వేశ్వరరావు

వీరఘట్టం: స్థానిక యూనియన్ బ్యాంకు పక్కనే ఉన్న గోదాంలో శుక్రవారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో ప్లాస్టిక్ సంచులతో పాటు జనపనార సంచులు కూడా దగ్ధమయ్యాయి. శుక్రవారం సాయంత్రం 6 గంటలకు జరిగిన ఈ అగ్ని ప్రమాదంలో చెలరేగిన మంటలు శనివారం తెల్లవారుజామున 4 గంటలకు అదుపులోకి వచ్చినట్టు పాలకొండ అగ్నిమాపక అధికారి జామి సర్వేశ్వరరావు తెలిపారు. ప్రమాదంలో సుమారు 1000 బండిల్స్ ప్లాస్టిక్ టార్పాలిన్లతో పాటు టైల్స్ కాలిపోయినట్టు గుర్తించామన్నారు. విలువైన మార్బుల్స్‌తో పాటు గోదాంలో ఉన్న స్లాబ్, గోడలు పూర్తిగా దెబ్బతిన్నాయని తెలిపారు. సుమారు రూ.80 లక్షల ఆస్తి నష్టం ఉంటుందని అంచనా వేశామన్నారు. తహసీల్దార్ ఏఎస్ కామేశ్వరరావు ప్రమాద స్థలాన్ని సందర్శించారు. ప్రమాదం ఎలా జరిగిందని గోదాం యజమాని కొత్తకోట వెంకటరమణను ఆరా తీశారు. ఆయనతో పాటు వీఆర్‌వో వి.రమేష్ నాయుడు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు. శనివారం ఉదయం పాలకొండ సీఐ ఎం.చంద్రమౌళి ప్రమాద స్థలాన్ని సందర్శించారు. బాధితునితో మాట్లాడారు.

**రూ.10 లక్షల సరుకును కాపాడిన యువత**

యూనియన్ బ్యాంకు పక్కన ఉన్న వ్యాపార సముదాయంలో రెండు గోదాంలు ఉండగా ఒక గోదాంలో అగ్ని ప్రమాదం జరిగింది. ఈ మంటలు పక్కనే ఉన్న గోదాంలోకి వ్యాపిస్తుండడంతో అందులో ఉన్న సుమారు రూ.10 లక్షల విలువ గల గోనె సంచులు ఉన్నాయి. స్థానిక కూరాకుల వీధికి చెందిన శ్రీకృష్ణా సేవా సంఘం యువత వెంటనే స్పందించి పక్క గోదాంలో ఉన్న గోనె సంచులను సురక్షిత ప్రాంతానికి తరలించారు. యువతకు బాధితుడు వెంకటరమణ కృతజ్ఞతలు తెలిపాడు.

# ఎస్పీ కార్యాలయంలో డీఐజీ తనిఖీలు



ఎస్పీ కార్యాలయంలో పోలీసు శాఖ అధికారులతో మాట్లాడుతున్న విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి

పార్వతీపురం రూరల్: వార్షిక తనిఖీల్లో భాగంగా విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి జిల్లా పోలీసు శాఖ కార్యాలయంలో ఉన్న పలు ప్రధాన విభాగాలను శనివారం తనిఖీ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో జిల్లా పోలీసు శాఖ కార్యాలయానికి వచ్చిన ఆయనకు ముందుగా ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసులు గౌరవ వందనం చేశారు. అనంతరం డీసీఆర్‌బీ, స్పెషల్ బ్రాంచ్, పాస్‌పోర్టు విభాగాలను ఆయన సందర్శించి రికార్డులు నిర్వహణను ఎస్పీ ఎస్‌వీ మాధవ్‌రెడ్డితో కలసి క్షుణ్ణంగా పరిశీలించారు. వివిధ సెక్షన్లు, వివిధ రకాలుగా నిర్వర్తించే అధికారులు, సిబ్బంది, వారి విధులు వంటి అంశాలపై అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా సోషల్ మీడియా, సైబర్ సెల్ విభాగాల్లో విధులు నిర్వర్తించే సిబ్బంది అందరినీ ప్రశ్నించి వారు రోజువారీ కార్యక్రమాలపై ఆరా తీశారు. అనంతరం పలు అంశాలపై సమీక్ష నిర్వహించిన డీఐజీ గోపీనాథ్ జట్టి నిర్వహణ, పనితీరుపై సంతృప్తిని వ్యక్తం చేశారు. వార్షిక తనిఖీల్లో ఎస్పీతో పాటు ఏఎస్పీ అంకితా సురాన, పాలకొండ డీఎస్పీ రాంబాబు, ఏఆర్ డీఎస్పీ థామస్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

### భర్తపై భార్య ఫిర్యాదు

విజయనగరం క్రైమ్ :

విజయనగరం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు భర్తపై కేసు నమోదైంది. మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీ గోవిందరావు ఆదేశాలతో ఎస్‌ఐ శిరీష భార్య ఇచ్చిన ఫిర్యాదుతో భర్తపై కేసు కట్టారు. వివరాల్లోకి వెళ్తే.. చెల్లూరుకు చెందిన మధుబాబు, సత్యవతికి 2012లో వివాహమైంది. పెళ్లి సమయంలో మధుబాబు కోరినంత రూ.2లక్షల కట్నం, మూడు సవర్ల బంగారం కానుకగా ఇచ్చారు. అయినా సత్యవతికి అత్తారింట్లో వేధింపులు మొదలయ్యాయి. అత్త, మామతో పాటు భర్త మధుబాబు కూడా సత్యవతిని కట్నకానుకల కోసం వేధించసాగాడు. ఈ బాధలు భరించలేక సత్యవతి మహిళా పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించింది. ఎస్‌ఐ శిరీష కేసు నమోదు చేసి మధుబాబును అదుపులోకి తీసుకొని దర్యాప్తు చేపట్టారు.

# ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలి

- జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి వంగలపూడి అనిత



మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి అనిత

విజయనగరం: ప్లాస్టిక్ ప్రతి ఒక్కరి నిత్య జీవితంలో భాగమైపోయిందని, అయితే ప్లాస్టిక్‌తో మన ఆరోగ్యాన్ని మనమే నాశనం చేసుకుంటున్నామని, ప్లాస్టిక్ అత్యంత ప్రమాదకరమని, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి వంగలపూడి అనిత అన్నారు. స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్రలో భాగంగా శనివారం గంటస్తంభం నుంచి బాలాజీ కూడలి వరకు జరిగిన ర్యాలీలో మంత్రి పాల్గొన్నారు. అనంతరం బాలాజీ కూడలిలో జరిగిన కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. మూడవ శనివారం ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతమొందిద్దాం అనే నినాదంతో ప్రభుత్వం రాష్ట్రమంతటా కార్యక్రమాలు నిర్వహిస్తుందని తెలిపారు. ప్లాస్టిక్ వినియోగంపై ఒక్క రోజులో మార్పు రాదనీ, ప్లాస్టిక్‌కి ప్రత్యామ్నాయం చూడాలని తెలిపారు. డ్వాక్రా, మెప్మా సంఘాల ద్వారా పేపర్, జనప నార, కాటన్‌తో బ్యాగ్‌లను తయారు చేసే యూనిట్లను స్థాపించేలా శిక్షణ ఇవ్వాలని తెలిపారు. ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు మాట్లాడారు. ఈ సందర్భంగా 12 మంది పారిశుధ్య కార్మికులను సన్మానించారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. సమావేశంలో సంయుక్త కలెక్టర్ సేతు మాధవన్, డీసీఎంఎస్ చైర్మన్ గొంప కృష్ణ , కార్పొరేషన్ కమిషనర్ నల్లనయ్య, సీపీవో బాలాజీ, ఆర్డీవో కీర్తి, కార్పొరేటర్లు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జిందాల్ నిర్వాసితుల ఫిర్యాదులపై విచారణ

- కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం అర్బన్: జిందాల్ సేకరణలో నిర్వాసితులైన లబ్ధిదారులకు అన్యాయం జరగకుండా చూస్తామని కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ హామీ ఇచ్చారు. కలెక్టర్ చాంబర్‌లో చీడిపాలెం, ముషిడిపల్లి, చినఖండేపల్లి, కిల్లంపాలెం, మూల బొడ్డవర గ్రామాలకు చెందిన 10 మంది రైతులు తమకు జిందాల్ భూములకు సంబంధించి ఇంతవరకు నష్టపరిహారం అందలేదని శనివరాం ఫిర్యాదు చేశారు. అందుకు సంబంధించిన దస్తాలు కలెక్టర్‌కు చూపించి వివరించారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ కేఆర్‌సీసీ డిప్యూటీ కలెక్టర్ మురళిని విచారణాధికారిగా నియమిస్తూ నిజనిర్ధారణ చేసి పూర్తి నివేదిక ఇవ్వాల్సిందిగా ఆదేశించారు. నివేదిక ప్రకారం తగిన చర్యలు తీసకోవడం జరుగుతుందని కలెక్టర్ వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ మురళి, లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

## రైతుబజారు తొలగించొద్దు..
# రైతు బతుకు బుగ్గిపాలు చేయొద్దు

- సీపీఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ



రైతుబజార్‌ను కొనసాగించాలని కోరుతూ సంతకాల ఉద్యమం చేపడుతున్న పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు

విజయనగరం గంటస్తంభం: పాత మహారాజ ఆస్పత్రి వద్ద ఉన్న రైతుబజారును తొలగించవద్దని సీపీఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ అన్నారు. అదే రైతుబజారు వద్ద విజయనగరం పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రైతుబజార్‌ను ఆస్పత్రి వద్దే కొనసాగించాలనే దానికి మద్దతు కూడగడుతూ సంతకాల సేకరణ శనివారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు అన్యాయం చేస్తే ఊరుకునేది లేదని, రైతులతో కలిసి రైతుబజార్‌ను కాపాడుకుంటామన్నారు. 1999 నుంచి రైతుబజారు అక్కడే ఉందని, అప్పటి నుంచి 50 కుటుంబాల వారు అదే బజారుపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారన్నారు. నగర ప్రజలకు అన్ని విధాలా అందుబాటులో ఉన్న ఈ స్థలం ఎమ్మెల్యే అదితిగజపతి, అశోక్ గజపతి రాజులు ఇన్నాళ్లు ఊరుకుని ఇప్పుడు ఆ స్థలం తమదని అప్పగించాలని అనడం సరికాదన్నారు. విద్యాదాతలు, భూ దాతలు అని చెప్పుకునే వారే ఇలా చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. అద్దెలు కట్టుకుని, పన్నులు చెల్లించుకుని మరీ కూరగాయలు అమ్ముకుని జీవనం సాగిస్తున్న వారిని తీసేయడమనేది వారి పొట్టకొట్టడమేనన్నారు. ప్రస్తుతం అక్కడ భూమి ఖరీదైనది కాబట్టి ఆ భూమిని లాగేసుకునే ప్రయత్నం చేయడం దుర్మార్గం తప్ప మరొకటి కాదన్నారు. పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి రెడ్డి శంకరరావు మాట్లాడుతూ ప్రభుత్వానికి అద్దెలు చెల్లించి రైతుబజారులో కూరగాయలు అమ్ముకుని జీవనం సాగిస్తున్న రైతు కుటుంబాలను రోడ్డున పడేస్తే ఎలా అని, వారి తరపున పోరాడుతామన్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రభుత్వం బాధ్యత తీసుకుని, రైతుబజారును అక్కడే ఉంచేలా చర్యలు తీసుకోవాలని లేకుంటే పోరాటం కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో రామ్‌జీ చాంబర్ ఆఫ్ కామర్స్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి కె.సురేష్, జిల్లా ఉపాధ్యక్షుడు టి.వి.రమణ, అంగన్‌వాడీ జిల్లా గౌరవాధ్యక్షులు వి.లక్ష్మి, ఐద్వా జిల్లా కార్యదర్శి పి.రమణమ్మ, సీఐటీయూ నగర కార్యదర్శి బి.రమణ, అధ్యక్షుడు జగన్‌మోహన్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి రాకోటి ఆనంద్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి హరీష్ తదితరులు పాల్గొన్నారు.

# నవీన్‌పై పీడీ యాక్టు

విజయనగరం క్రైమ్ : చట్టాన్ని తరచూ ఉల్లంఘిస్తూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్న రాజాం మండలం గురువాంకు చెందిన కుప్పిలి నవీన్(19)పై పీడీ యాక్టు ప్రయోగించి, ముందస్తు నేర నియంత్రణ చర్యల్లో భాగంగా నవీన్‌ను విశాఖ సెంట్రల్ జైలుకు తరలించినట్టు ఎస్పీ వకుల్ జిందల్ శనివారం తెలిపారు. నవీన్ చెడు వ్యసనాలకు అలవాటు పడి, దురుసుగా ప్రవర్తిస్తూ ఇతరులకు హాని కలిగించే విధంగా మారాడని ఎస్పీ పేర్కొన్నారు. చిన్న చిన్న విషయాలకే తగదా పడుతూ.. భౌతిక దాడులకు పాల్పడుతూ గత ఐదేళ్లలో రాజాం పోలీస్‌స్టేషన్‌లో నాలుగు, సంతకవిటి పోలీస్‌స్టేషన్‌లో ఎనిమిది కేసుల్లో నిందితుడిగా అరెస్టు అయ్యాడని వెల్లడించారు. నేరాల నియంత్రణకు జిల్లా పోలీసు శాఖ చేపడుతున్న ముందస్తు చర్యల్లో భాగంగా నవీన్‌పై పీడీ యాక్టు అమలు చేయాలని కోరుతూ రాజాం పోలీసులు జిల్లా పోలీసు కార్యాలయానికి ప్రతిపాదనలు పంపారని తెలిపారు. వాటిని సిఫారసు చేస్తూ కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపామన్నారు. ఈ మేరకు నవీన్‌ను నిర్బంధించి విశాఖపట్నం సెంట్రల్ జైలుకు తరలించామని ఎస్పీ తెలిపారు.

### హక్కులను సద్వినియోగం చేసుకోవాలి

- కొత్తవలస జూనియర్ సివిల్ జడ్జి డాక్టర్ ఎస్.విజయచంద్రన్



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి విజయచంద్రన్

కొత్తవలస: రాజ్యాంగం కల్పించిన హక్కులను ప్రతి మహిళా సద్వినియోగపర్చుకోవాలని కొత్తవలస జూనియర్ సివిల్ జడ్జి డాక్టర్ సముద్రాల విజయచంద్రన్ అన్నారు. మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యలో శనివారం నిర్వహించిన న్యాయ అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందన్నారు. చదువే వ్యక్తిగత అభివృద్ధికి మూలమని.. విద్యతోనే అభివృద్ధి సాధించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వి.వి.శ్రీదేవి, న్యాయవాదులు గొడుగుల మహేంద్ర, డి.శ్రీనివాస్, జీవీ రమణ, వెలుగు ఏపీఎం ఎం.వెంకటరమణ, ఎస్సై సీహెచ్.హేమంత్, తదితరులు పాల్గొన్నారు.